క్లుప్తంగా

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



కేటీదొడ్డి: మండలంలోని నందిన్నెలో శుక్రవారం బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని గ్రామస్తులు ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ భీమరాయుడు మాట్లాడుతూ పక్క రాష్ట్రం కర్ణాటకకు కూలీలకు వెళ్తున్న విద్యార్థులను తల్లిదండ్రులు బడిలో చేర్పించాలని కోరారు. ఆటోలా ద్వారా పత్తి మిల్లులకు వ్యవసాయ కూలీలకు తీసుకెళ్తున్న వాహనాలను తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని నందిన్నె చెక్‌పోస్ట్ ఎక్సైజ్ సీఐ ఖలీద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గీత, మిల్లు వీరన్న, రంగారెడ్డి, రాఘవేంద్ర, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీతోనే దేశాభివృద్ధి'



అయిజ: ప్రధానినరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి చెందుతుందని, బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఉప్పలలో వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, కిసాన్ యోజన, స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి విప్లవాత్మక పథకాలు కోట్లాది మంది లబ్ధిదారులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాయని తెలిపారు. కార్యమంలో ఎంపీటీసీ ప్రహ్లాదరెడ్డి, వెంకటేష్, తులసికుమార్, అధికారులు, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విశ్వకర్మ పథకంపై అవగాహన

అయిజ: ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై శుక్రవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చేతివృత్తి దారులకు ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం వర్తిస్తుందని తెలిపారు. సమస్యలు కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడుకి వినతిపత్రం అంజేశారు. కార్యక్రమంలో శేఖర్, రాజన్న, చిరంజీవి, నాగరాజు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



గద్వాల అర్బన్: నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 31న విద్యార్థులకు నిర్వహించనున్న టాలెంట్ టెస్టు కరపత్రాలను శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయంలో ఇన్‌చార్జ్ డీఈఓ ఇందిరా విడుదల చేశారు. విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి పోటీ పరీక్షలు ఎంతో దోహదపడుతాయని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్‌టీఎస్ఎఫ్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రతాప్, ఏసీఈ శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సీతారాములు, అంపయ్య, శాంతిరాజు తదితరులు ఉన్నారు.

పద్మశాలీల అభ్యున్నతికి ఎంతో కృషి



గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలో నల్లకుంటలో శుక్రవారం జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మృతి చెందిన తెలంగాణ ప్రాంతీయ పద్మశాలి అధ్యక్షుడు ప్రభాకర్, రాష్ట్ర కన్వీనర్ రామ శ్రీనివాసులు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించి, సంతాపం తెలిపారు. జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రభాకర్, రామ శ్రీనివాసులు రాష్ట్రంలో ఉన్న పద్మశాలీల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. సాయిబాబ, ప్రభాకర్, శ్రీనివాసులు, రఘు, అక్కల విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.

హరితహారం మొక్కలను సంరక్షించాలి

మల్దకల్: హరితహారంలో రోడ్లకు ఇరువైపుల నాటిన మొక్కలను సంరక్షించాలని ఎంపీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామ సమీపంలో రోడ్లకు పక్కన నాటిన హరితహారం మొక్కలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కల చుట్టూ పాదులు తవ్వి వాటికి ట్రీగార్డులను ఏర్పాటు చేయాలని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నర్సరీలలో వచ్చే హరితహారం నాటికి మొక్కలను పెంచాలని నర్సరీ నిర్వాహకులకు సూచించారు.

పొలాలకు వెళ్లేదెలా..?

- పొలాల మధ్యలో వెళ్లిన ఆరు లైన్ల భారత్‌మాల రహదారి
- ఆరడుగుల మేర పొలాల్లో వేసిన ఎత్తైన రోడ్డు
- పొలాలకు వెళ్లే దారుల్లో సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయని వైనం
- అండర్ బ్రిడ్జి, సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్



భారత్‌మాల రోడ్డు నుంచి పొలాలకు వెళ్లేందుకు ఏర్పాటు చేసుకున్న రేలింగ్

శాంతినగర్: ఓ పక్క పంటలు పండే పొలాలు పోయి బాధపడటమే కాక, మరో పక్క మిగిలిన పొలాలకు రోడ్డు సౌకర్యంలేక ఏమి చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. అలంపూర్ నియోజకవర్గంలోని అయిజ, వడ్డేపల్లి, రాజోళి మండలాల పరిధిలో 35 కిలోమీటర్ల మేర ఆరు లైన్ల భారత్ మాల రహదారి నిర్మిస్తున్నారు. పొలాల్లో ఆరడుగుల మేర ఎత్తుగా మట్టిపోసి రోడ్డు పనులు చేపడుతున్నారు. గతంలో పొలాలకు ఉన్న బాటలు ఎత్తైన రోడ్డు వేయడంతో మూసుకుపోయాయి. దీంతో ఆయా గ్రామాల నుంచి పొలాలకు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయమై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పొలాలకు వెళ్లే దారుల్లో సర్వీస్ రోడ్డు ఏర్పాటుచేసి ఇబ్బందులు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

ఎత్తైన రోడ్డు నుంచి పడిపోయే అవకాశం

పొలాల్లో ఆరడుగుల మేర ఎత్తైన రోడ్డు వేయడంతో పైనుంచి ఎడ్ల బండ్లపై వెళ్లే క్రమంలో అదుపుతప్పి పడిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది తక్కువ ఎత్తులో రోడ్డు ఉండేదని ఎలాగోలా పొలాలకు వెళ్లేవారమని రైతులు వాపోతున్నారు.

సొంత పొలం సాగుచేయలేని దుస్థితి..

ఒకే సర్వే నంబర్ మధ్యలో రోడ్డు వేయడంతో కొంత పొలం అటు, మరికొంత పొలం ఇటు విడిపోయింది. దీంతో రెండు వైపుల ఉన్న పొలంలో వ్యవసాయం చేయలేని పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈవలి వైపు నుంచి అవతలి వైపు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయని చెబుతున్నారు. రూ.20 నుంచి రూ.30 లక్షలు ధర పలికే పొలాలను రూ.4.50 లక్షలకు తీసుకున్నారని, అటు ఆర్థికంగా నష్ట పోవడమేగాక ఉన్న పొలం సాగుకునోచుకోవడం లేదని వాపోతున్నారు.

ట్రాక్టర్ వెళ్లడం కష్టంగా మారింది



మా పొలం సమీపంలో ఆరు లైన్ల రహదారి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఎత్తు తక్కువగా ఉండటంతో మట్టి రేలింగ్ తయారు చేసుకుని పొలానికి వెళ్తున్నాం. ఆరడుగుల మేర రోడ్డు నిర్మించాక పొలానికి ఎలా వెళ్లాలో తెలియడం లేదు. ప్రధాన రహదారి నుంచి అండర్ బ్రిడ్జి నిర్మిస్తే బాగుండేది. సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలి.

– నారాయణ, రైతు, వెంకటాపురం

ఎడ్ల బండి విడిచి వెళ్తున్నా..



మా పొలంలో పెద్ద రోడ్డు వేశారు. ఆవలి వైపున పొలం ఉంది. ఎడ్ల బండి పొలానికి వెళ్లడానికి ఎత్తైన రోడ్డు అడ్డంకిగా మారింది. ఇవతలి వైపున బండి నిలిపి వెళ్తున్నాను. పొలాలకు వెళ్లడానికి అక్కడక్కడ అండర్ బ్రిడ్జిలు నిర్మించి సర్వీస్ రోడ్డు వేస్తే రైతులకు బాగుంటుంది. లేదంటే పొలాల్లో పండిన ధాన్యం ఇంటికి తెచ్చుకోలేని పరిస్థితి ఉంటుంది.

– రామారావు, రైతు, కొంకల

ఆన్‌లైన్ ప్రక్రియ 80 శాతం పూర్తి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రమణరావు

మానవపాడు: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా స్వీకరించిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ 16 గ్రామాల వారీగా మండల కేంద్రంలోని పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది 80 శాతం పూర్తి చేశారని ఎంపీడీఓ రమణరావు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మిగిలిన 20 శాతం శనివారం నాటికి పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. రేషన్‌కార్డులకు సంబంధించి వివరాలను పూర్తిస్థాయిలో సిబ్బంది వద్ద ఉంచుకోవాలని తెలిపారు. ప్రతి గ్రామంలో నర్సరీలను పరిశీలించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ ఆంజనేయరెడ్డి, రామకృష్ణ, కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



గద్వాల అర్బన్: పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను శుక్రవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కాంతమ్మ, డిప్యూటీ సీఈఓ ముషాహిదాబేగం, మండల పరిషత్ అధికారులు తదితరులు ఉన్నారు.

వివేకానందుని స్ఫూర్తితో ఎదగాలి



అయిజలో..

గద్వాల: యుక్త వయస్సులోనే దేశ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు స్వామి వివేకానందుడని.. ఆయన స్ఫూర్తితో యువకులు ముందుకు సాగాలని ఎస్టీయూ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి సోమసుందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక రాజీవ్‌మార్గ్ రోడ్డులోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యువతకు ఆదర్శం..

అలంపూర్: యువతకు ఆదర్శం స్వామి వివేకానంద అని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. పట్టణంలో స్వామి వివేకానంద యూత్ సొసైటీ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, వివేకానంద యూత్‌సొసైటీ అధ్యక్షుడు రజనీబాబుతో కలిసి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. మున్సిపాలిటీలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాల, కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, ఉపన్యాస, క్విజ్ పోటీలను నిర్వహించారు.



రాజోళిలో దుప్పట్ల పంపిణీ

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు, మండల కేంద్రంలో వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. పుల్లూరులో ఎమ్మెల్యే విజయుడు హాజరై పూలమాలలు వేశారు. కార్యక్రమంలో కలుగోట్ల పీఏసీఎస్ చైర్మన్ గజేందర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లుగౌడ్, కృష్ణ, మగ్బుల్ పాల్గొన్నారు.

అయిజ: మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లో స్వామి వివేకానంద జయంతి ప్రజలు ఘనంగా నిర్వహించారు. విగ్రహాలకు, చిత్రపటాలకు వివిధ పార్టీలు, సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వివేకానంద జీవితం స్ఫూర్తిదాయకం

రాజోళి: స్వామి వివేకానంద జీవితం యువతకు స్ఫూర్తి దాయకమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం, పచ్చర్లలో వివేకానంద జయంతి వేడుకల్లో వారు వేర్వేరుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాజోళికి చెందిన శివరామయ్య వృద్ధులకు, నిరాశ్రయులకు, దుప్పట్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు నిషాక్, వీరేష్‌రెడ్డి, వీరేష్, ఆనంద్, ఖాజా, ఎంపీటీసీ పరమేష్, సర్పంచ్ తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.

మల్దకల్: మండలంలో స్వామి వివేకానంద జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, జెడ్పీహెచ్ఎస్, విఠలాపురం జెడ్పీహెచ్ఎస్‌లలో చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి పూజలు చేశారు.

కేటీదొడ్డి: నందిన్నెలోని రాఘవేంద్ర పాఠశాలలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. కార్యక్రమంలో వెంకటేష్, అంజలి, భారతి, నవిత, మంజుల, స్వర్ణలత, పావని, వసంత, శ్రీదేవి, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.



అలంపూర్‌లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయుడు



జిల్లా కేంద్రంలో నివాళులర్పిస్తున్న ఎస్టీయూ యూనియన్ నాయకులు



మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



కేటీదొడ్డిలో..

విద్యార్థులకు ముగ్గుల పోటీలు



జిల్లా కేంద్రంలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



గట్టులో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

గద్వాలన్యూటౌన్: పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు రంగవల్లుల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం

గట్టు: సంక్రాంతి పండుగ సందర్భంగా శుక్రవారం ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి ప్రిన్సిపాల్ శశిధర్‌రెడ్డి, ఐద్వా కార్యదర్శి నర్మద బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ, రాధిక, శ్రీజ, మహేష్, రంగస్వామి, రాజగోపాల్, రాజు, విష్ణు, భరత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తలదించుకోవాల్సిందే..



కొనసాగుతున్న రాయచూర్ రైల్వే ట్రాక్ వద్ద అండర్ బ్రిడ్జి పనులు



బ్రిడ్జి కింద నుంచి వస్తున్న వాహనదారులు

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పిల్లిగుండ్ల కాలనీలో అటు గద్వాల – కర్నూల్, ఇటు గద్వాల–రాయచూర్ రైల్వేలైన్ల వద్ద అండర్ బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయి. దీంతో పిల్లిగుండ్ల కాలనీకి వెళ్లాలంటే రాయచూర్ రైల్వేట్రాక్ బ్రిడ్జి కింద ద్విచక్ర వాహనాలపై తలదించుకుని ప్రమాదకరంగా రాకపోకలు సాగించాల్సి పరిస్థితులు నెలకొన్నాయి. అదేవిధంగా మేలచేర్వు, జమ్మిచేడుకు వెళ్లాలంటే కర్నూల్ రైల్వే ట్రాక్ బ్రిడ్జి కింద ఇదే తరహాలో ప్రయాణించాలి. కొంచెం ఆదమరిచి తలెత్తితే గాయాలపాలయ్యే అవకాశం ఉంది. ఇలా ప్రమాదకరంగా ప్రయాణాలు సాగిస్తూ తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోతున్నారు. ఒక వాహనం వెళ్లిందంటే మరోకరు ఆగాల్సిందే.

– గద్వాల అర్బన్

గ్రామీణ రోడ్లకు దక్కని మహర్దశ



బురదమయంగా ఉన్న నీలహళ్లి – నెట్టెంపాడు రోడ్డు

ధరూరు: గ్రామాలకు వెళ్లే రోడ్లు రోజు రోజుకు మరింత అధ్వానంగా తయారవుతున్నాయి. మారుమూల గ్రామాల అభివృద్ధికి పాలుకులు, అధికార యంత్రాంగం పాటుపడటంలేదని ఆయా వాహనదారులు, ప్రజలు ఆరోపిస్తున్నారు.

అధ్వానంగా రోడ్లు..

మండల పరిధిలోని ఆయా గ్రామాల లింకు రోడ్లు నేటికి మట్టి రోడ్లుగానే దర్శనమిస్తున్నాయి. ఇటీవల నెట్టెంపాడు– నీలహళ్లి వెళ్లే మార్గంలో బురద, గుంతలమయంగా ఉన్న రోడ్డుపై జారిపడి ఓ వ్యక్తి చేయి విరిగింది. గుర్రోనిపల్లి – దోర్నాల, రాయచూరు రోడ్డు – కాపులకుంట, దోర్నాల– కొత్తపాలెం, మార్లబీడు – ర్యాలంపాడు, చింతరేవుల రోడ్డు– జీరుబండ, కాపులకుంట – దోర్నాల, ఓబులోనిపల్లి – ర్యాలంపాడు తదితర గ్రామాలు బీటీకి నోచుకోవడం లేదు. శాఖల మధ్య సమన్వయం లేకపోవడం కూడా ఈ రోడ్ల నిర్మాణాలు జరగకపోవడానికి కారణాలుగా తెలుస్తుంది. కొన్ని చోట్ల పంచాయతీరాజ్, కొన్ని చోట్ల ఆర్అండ్‌బీ శాఖల రోడ్లు ఉండడంతో రోడ్డు వేసేందుకు అడ్డంకిగా మారినట్లు ప్రజలు చెబుతున్నారు.

నివేదిక పంపిస్తాం

ఇప్పటి వరకు మాకు ఈ లింకు రోడ్లకు సంబంధించి ఆదేశాలు రాలేదు. దీనిపై ప్రభుత్వం నివేదిక ఇవ్వాలని కోరలేదు. ఒక వేళ ఉన్నతాధికారుల నుంచి అలాంటివేమైనా ఆదేశాలు వస్తే వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తాం.

– భరత్‌కుమార్‌రెడ్డి, పీఆర్ ఏఈ ధరూరు

కొనసాగుతున్న అధ్యయనోత్సవాలు



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం అధ్యయనోత్సవాలు కొనసాగాయి. ఉత్సవాలలో భాగంగా రెండవరోజు ఆలయంలో సుప్రభాతసేవ, తిరువారాధన, ప్రభంద పారాయణ పూజలను అర్చకులు వైభవంగా జరిపారు.

పంచాయతీ భవనాలు ప్రారంభం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఉదండాపురం, శనిగపల్లిలో శుక్రవారం కొత్త పంచాయతీ భవనాలను ప్రారంభించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు హాజరయ్యారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ హనుమంతురెడ్డి, ఎంపీపీ స్నేహ తదితరులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకుడు నీలి శ్రీనివాస్ నివాసంలో ఏర్పాటు చేసి తేనేటి విందుకు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతురావు హాజరయ్యారు. కేరళ నుంచి హైదరాబాద్ వెళ్తున్న క్రమంలో ఎర్రవల్లి కూడలిలో నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతి

అయిజ: మండలంలోని అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడుపాలని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం గద్వాల ఆర్టీసీ డిపో మేనేజర్ మంజులారెడ్డికి వినతి పత్రం అందజేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జయన్న తెలిపారు. అయిజ నుంచి ఉత్తనూరు మీదుగా తుపత్రాల, మేడికొండ, పులికల్‌కు బస్సులు ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.